క్లుప్తంగా

తాగునీటికి ఆటంకం లేకుండా చర్యలు

సీటీఆర్‌ఐ: వేసవి నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేసి, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం డివిజన్ రెవిన్యూ డివిజనల్ అధికారి ఏ.చైత్రవర్షిణి ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు, మాల్స్, దేవాలయాలు, స్కూళ్లు, నిరుపేదలకు రాత్రి బస చేసే ప్రదేశాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగు నీరు, మజ్జిగ పంపిణీ కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులు, కోళ్లు తదితర వాటి రక్షణ కోసం జాగ్రత్తలు తెలియజేస్తూ పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.

ఎన్నికల హెల్ప్‌డెస్క్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో వచ్చే సందేహాల నివృత్తి కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మొదటి అంతస్తులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ డెస్క్ శుక్రవారం నుంచి అందుబాటులోకి వస్తుందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పనిచేస్తుందన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: రామాలయం ఫీడర్‌లో మరమ్మతుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. మల్లిన నగర్, రామాలయం సెంటర్, జేఎస్ రోడ్డు, తరుణి కాంప్లెక్స్, కేఎల్ఎం ఏరియా, అభయ హాస్పిటల్, రత్న అపార్టమెంట్ ఏరియాలలో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాగి వస్తువులు, చీరల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగి వస్తువులు

కడియం: మండలంలోని పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద రూ.71 వేలు విలువైన రాగి వస్తువులు, రూ.1.19 లక్షల విలువైన 140 చీరలను స్వాధీనం చేసుకున్నట్లు కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ గురువారం తెలిపారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుంగా బిల్లులు లేకుండా తరలిస్తున్న వీటిని పట్టుకున్నామన్నారు. సంబంధిత ఉన్నతాధికారులకు అందజేసినట్లు వివరించారు.

15న ఎన్నికల సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికలలో విధులు నిర్వహించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈనెల 15న స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ కోసం కళాశాలలో పది రూములు కేటాయించారన్నారు. ఎన్నికల శిక్షణతో పాటు ఎన్నికల సిబ్బంది నుంచి పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. శిక్షణలో పాల్గొనే వారు ఉత్తర్వుల కాపీలు తెచ్చుకోవాలన్నారు. ఈవీఎంల వినియోగం, మాక్ పోలింగ్, ఎన్నికలకు సంబంధించిన ఫారాలు పూర్తి చేయడం తదితర విషయాలపై శిక్షణ ఇస్తామన్నారు. హాజరు కాని వారిపై క్రమశిక్షణా చర్యలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమణ, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు, మున్సిపల్ ఆరోగ్య అధికారి డా.ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే హస్తం గుర్తుకు ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక 2వ డివిజన్ ఇందిరా నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

2 కేజీల గంజాయి పట్టివేత

కంబాలచెరువు: కోరుకొండకు చెందిన కె.నరేష్, బాబూరావు గురువారం జైలు రోడ్డులో వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే

- ఆయన సేవలు చిరస్మరణీయం
- జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



పూలే విగ్రహానికి నమస్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్



పూలే చిత్రపటానికి బీసీ నాయకుల నివాళి



జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్ఈ గురుబాబు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బడుగు వర్గాల ఆశాజ్యోతి, అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. పూలే జయంతి సందర్భంగా బొమ్మూరులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మంత్రి వేణు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల రక్షణ, అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలన్నింటికీ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలే ఆదర్శమన్నారు. పూలే ఎందరో సంస్కర్తలకు మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఆయన సతీమణి సావిత్రీ బాయి కూడా స్త్రీవిద్య కోసం విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అంగాడ సత్యప్రియ, ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, పెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, తలారి ప్రసాద్, చింతపర్తి రాంబాబు, దండంగి ప్రభు, మస్తాన్ బేగ్, షట్టర్ బాషా, మీరా వలీ, వెర్రియ్య, ఎల్‌వీ ప్రసాద్, పెన్నాడ లక్ష్మి, కడలి రాంబాబు, బీదం రాజు, హుకుంపేట నాగు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి : ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్‌ఐ: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. గోదావరి గట్టు విద్యుత్ కార్యాలయం సమీపంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద గురువారం ఆయన జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ పూలే పోరాటం, త్యాగాల ఫలితంగా నేడు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు అనేక హక్కులను పొందగలుగుతున్నారన్నారు. గోదావరి గట్టుపై గల పూలే విగ్రహానికి ఎదురుగా పూలే, అంబేద్కర్ భవన్ మూలవాసీల జీవితాల్లో వెలుగులు నింపే చక్కని వేదిక కాబోతోందన్నారు. గ్రూప్స్, సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే పేద విద్యార్థులకు ఈ భవనం దిశా నిర్దేశం చేయగలదనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. నయనాల కృష్ణారావు, నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కంబాలచెరువు: పూలే ఆశయాలను సాకారం చేసేందుకు అందరూ ఏకతాటిపై ముందుకు సాగుదామని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు పిలుపునిచ్చారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప, జాయింట్ సెక్రటరీ దర్నాలకోట వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కాశీ శ్రీనివాసరావు, మాజీ జనరల్ సెక్రటరీ బట్టు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పూలే విగ్రహానికి పుష్పాంజలి

కడియం: జేగురుపాడులోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు బలహీన వర్గాల ఉన్నతికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఎంపీటీసీ ఆకులసుధాకర్, గౌడ సంఘం అధ్యక్షుడు మారిశెట్టి నాగన్న, ఫిషర్‌మెన్ సంఘ అధ్యక్షుడు సాక కిరణ్ కుమార్, సచివాలయ కన్వీనర్ బుడ్డిగ లక్ష్మణరావు, సుదర్శన రావు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త

కడియం: సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని కాంగ్రెస్ పార్టీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు.

బీసీ సంక్షేమ సంఘం నివాళి

ప్రకాశం నగర్: జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలేకు ఘనంగా నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కోశాధికారి గుత్తుల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి గొర్సా తాతబ్బాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్ ఓఅండ్ఎం సర్కిల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఏ.గురుబాబు ఆధ్వర్యంలో గురువారం పూలే జయంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి గురుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈ కె.విజయ కుమార్, ఏడీఈ రాయుడు రమేష్‌బాబు, శివలింగ కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సిటీ ఎమ్మెల్యేగా భరత్ రామ్ విజయం ఖాయం



విలేకరులతో మాట్లాడుతున్న అడపా శ్రీహరి, పాలిక శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ విజయం ఖాయమని ఆ పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో బుధవారం నిర్వహించిన మేమంతా సిద్ధం కార్యక్రమం అంచనాకు మించి విజయవంతమైందన్నారు. ఎమ్మెల్యేగా భరత్ రామ్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు తరలివచ్చాయన్నారు. సభ విజయంతో కూడమి ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు హడావుడిగా టూరిజం అభివృద్ధి, గోదావరి రివర్ ఫ్రంట్ నిర్మాణం, ఘాట్ల సుందరీకరణ, అనుసంధానం అంటూ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇవన్నీ ఎంపీ భరత్‌రామ్ ప్రణాళికను కాపీ కొట్టి చేస్తున్నారన్నారు. చారిత్రక కట్టడాలు, దేవాలయాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని వాసు అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. నగరంలో సుప్రసిద్ధ రాళ్లబండి మ్యూజియానికి కొత్త భవనం నిర్మిస్తున్న సంగతి వాసుకు తెలియదన్నారు. ఆదిరెడ్డి వాసుకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పబోతున్నారన్నారు.

బాధితుడికి అండగా ఉంటాం

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగాను గూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన మేడిశెట్టి రామచంద్రరావుకు ప్రభుత్వం తరఫున సాయం అందజేస్తామని తాహసీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ హోటల్ వ్యాపారం నిర్వహిస్తుండగా బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. సుమారు రూ.8 లక్షలు నష్టం కలిగిందని బాధితుడు తెలిపాడన్నారు.

పవిత్రత, త్యాగానికి ప్రతీక రంజాన్



రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్



కడియం మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

- ఎంపీ భరత్‌రామ్
- పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

సీటీఆర్‌ఐ: పవిత్రత, త్యాగం, దయ, ప్రేమకు ప్రతీక రంజాన్ అని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బంధుమిత్రులు, స్నేహితులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. నగరంలోని పలు మసీదుల్లో జరిగిన ప్రార్థనల్లో ఎంపీ భరత్ రామ్ పాల్గొన్నారు. ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ ఉపవాసాల కారణంగా ఆకలి దప్పికల విలువ తెలుస్తుందన్నారు. వీటి ద్వారా అల్లా కరుణకు చేరువ అవడంతో పాటు, తోటివారు కష్టాలలో ఉంటే ఆదుకునే మనస్తత్వం, దయ, ప్రేమ, త్యాగం అలవడతాయన్నారు. పండగ మాసంలో ముస్లింలు చేసే దానాలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ముస్లింలకు షాదీ ఖానా కోసం నగరంలోని పాత కబేళా వద్ద 1500 గజాల స్థలాన్ని కేటాయించామన్నారు. ఏడాదిన్నరలో షాదీఖానా నిర్మాణం పూర్తవుతుందన్నారు. అలాగే ఈద్గా కూడా రెండు ఎకరాలలో నిర్మించాలని భావిస్తున్నట్టు తెలిపారు. అల్లా దయతో సిటీ ఎమ్మెల్యే కాగానే ఈద్గా నిర్మాణానికి శ్రీకారం చుడతానని తెలిపారు. కార్యక్రమాలలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, అజ్జరపు వాసు, హబీబుల్లా ఖాన్, కరిముల్లా ఖాన్, ఎస్‌కే సుభానీ, నందం స్వామి, పాల వెంకటేశ్వరరావు, మదీనా బాషా, గద్దె శ్రీను, పంపన శ్రీను, ముప్పన శ్రీను పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: రంజాన్ పండగను పురస్కరించుకుని గురువారం మండలంలోని పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడియంలోని మస్జిద్ ఏ కౌసర్, దుళ్ల, పొట్టిలంక, వీరవరం, వేమగిరిలోని మసీదులలో మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

మత సామరస్యం

సీటీఆర్‌ఐ: మత సామరస్యానికి చక్కటి నిర్వచనం రంజాన్ అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నెహ్రూ నగర్ తదితర ప్రాంతాల్లోని పలు మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు.

సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్లకు 325 నోటీసులు

కంబాలచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీపై తప్పుడు పోస్టులు పెట్టిన సామాజిక మాధ్యమాల గ్రూప్ అడ్మిన్లకు జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకూ 325 నోటీసులు జారీ చేశామని అందజేశామని ఎస్పీ పి.జగదీష్ గురువారం తెలిపారు. జిల్లా చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు సోషల్ మీడియా సెల్ ప్రారంభించామని, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై దాని ద్వారా నిఘా ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయ, మత, కులపరమైన వివిధ సోషల్ మీడియా గ్రూపులను గుర్తించినట్టు తెలిపారు. అయితే తెలుగుదేశం పార్టీ నాయకులకే ఎక్కువ నోటీసులు ఇచ్చారని ప్రచురించిన వార్త పూర్తిగా అవాస్తవమన్నారు. అన్ని పార్టీలకు చెందిన సామాజిక మాధ్యమాల గ్రూప్ అడ్మిన్లకు నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. తప్పుడు వార్తలు ప్రచురించి ప్రజలను ఇబ్బందులకు గురి చేయరాదని హితవు పలికారు. సోషల్ మీడియాలో వస్తున్న అసభ్యకర, అభ్యంతర, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, ట్రోలింగ్‌లకు సంబంధించి 94407 96577 వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇప్పటి వరకూ వైఎస్సార్ సీపీ గ్రూప్ అడ్మిన్లకు 114, టీడీపీ గ్రూప్ అడ్మిన్లకు 83, జనసేనకు 42, బీజేపీకి 6, ఐఎన్‌సీకి 14, క్యాస్ట్ గ్రూప్ అడ్మిన్లకు 41, ఇతరులకు 25 నోటీసులు జారీ చేశామని తెలిపారు.

వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించండి



19వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- 19వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కోరారు. నగరపాలకసంస్థ పరిధి 19వ డివిజన్‌లో ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబు, పవన్‌ల అబద్ధపు హామీలను నమ్మవద్దన్నారు. జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. మరోసారి జగన్ ముఖ్యమంత్రి అయితేనే పథకాలు కొనసాగుతాయని తెలిపారు. అధికార దాహంతో కూటమిగా ఏర్పడిన ప్రతిపక్షాలకు ప్రజలే తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. వైఎస్ జగన్ చేస్తున్న ఎన్నికల బస్సుయాత్రకు వస్తున్న జనాన్ని చూసి కూటమి నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, మింది నాగేంద్ర, దుంపా చంద్రారెడ్డి, మమత బ్రహ్మానందరెడ్డి, కర్రి బాబ్జీ రెడ్డి, రాజమౌళి, అంగాడ సత్యప్రియ, మద్దాల అను, చాప రాజా, కుడిపూడి గిరి, నాగిరెడ్డి మోహన్, కాటం సుస్మిత, మండపాక సరళ, కాత్యాయిని, ఓదూరి రామకృష్ణ, టింకు, మైలపల్లి కాళీ, కర్రి ప్రసాద్ రెడ్డి, పిట్టా కన్న పాల్గొన్నారు.

తూర్పు కాపులకు అండగా ఉంటాం

- ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- మనీష్ ఫంక్షన్ హాలులో సమావేశం



ఎంపీ భరత్ రామ్, ధర్మశ్రీ, రౌతు సూర్యప్రకాశరావులను సత్కరిస్తున్న తూర్పుకాపు సంఘ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: తూర్పు కాపుల సంక్షేమం, అభ్యున్నతికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ హామీ ఇచ్చారు. కొంతమూరులోని మనీష్ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన తూర్పు కాపుల ఆత్మీయ సమావేశానికి రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ భరత్ రామ్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హాజరయ్యారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ వలస కార్మికులు, తూర్పు కాపుల సమష్టి జీవన విధానం, ఐక్యత ఎంతోమంది శ్రామికులకు స్ఫూర్తిని ఇస్తుందన్నారు. తమ శక్తిని, సామాజిక బలాన్ని నమ్ముకుని ఆత్మ విశ్వాసంతో జీవన యానం సాగిస్తున్న తూర్పు కాపులకు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తూర్పు కాపులకు నగరంలో ఒక కమ్యూనిటీ హాలు ఉందని, మరోదాని కోసం క్వారీ మార్కెట్ ఏరియాలో స్థలం మంజూరు చేశామన్నారు. నిర్మాణానికి ఎంపీ నిధులు, రుడా నిధులు కేటాయించినట్టు తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమమైనా, అభివృద్ధి అయినా కొనసాగుతుందన్నారు. తూర్పుకాపులకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం, దండా రాంబాబు పాల్గొన్నారు.

నగరాభివృద్ధే ప్రధాన లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ: నగర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. 39వ డివిజన్‌లో పార్టీ ఇన్‌చార్జి లంక ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చాలా డివిజన్లలో డ్రైనేజీ సమస్య నెలకొందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఆ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నగర ప్రజలకు 24 గంటలూ తాగునీరు సరఫరా అయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. కంబాల చెరువు పార్కు మాదిరిగా ఏబీ నాగేశ్వరరావు పార్కును అభివృద్ధి చేస్తానన్నారు. ఆయన వెంట నీలి ఆనంద్ కుమార్, కొమ్మోజు దుర్గారావు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సీతానగరం: పురుషోత్తపట్నం బెల్లేహం హౌస్ ఆఫ్ బెడ్ వృద్ధాశ్రమంలో ఉంటున్న సామర్లకోటకు చెందిన కాంతమ్మ (58) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గత నెల 26న గుర్తు తెలియని వ్యక్తులు కాంతమ్మను వృద్ధాశ్రమం వద్ద వదిలి వెళ్లిపోయారు. ఆమె అనారోగ్యంగా ఉండటంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాంతమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు.

తపాలా సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖ ప్రైవేటీకరణ, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్న జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గుర్తింపును కేంద్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ఎస్ఎఫ్ పీఈ సర్కిల్ సెక్రటరీ జి.శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయంలో గురువారం తపాలా డివిజన్ అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తపాలా పరిధిలో ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో నిస్వార్థంగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. రాష్ట్ర యూనియన్ ప్రెసిడెంట్ శంకర్ నాయుడు మట్లాడుతూ ముఖర్జీ స్ఫూర్తితో సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. యూనియన్ ప్రెసిడెంట్ యూజీ ప్రకాష్, రామచంద్రపురం యూనియన్ ప్రెసిడెంట్ వి.కృష్ణ మోహన్, కార్యదర్శి జీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణకు ఓటుహక్కు వజ్రాయుధం



ఈవీఎం మోడల్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు మిశ్రా, కలెక్టర్ తదితరులు

రాజానగరం: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుహక్కును వజ్రాయుధంగా వినియోగించాలని రాష్ట్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు రామ్‌మోహన్ మిశ్రా అన్నారు. జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీఓ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన మోడల్ ఈవీఎంను గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ ఆగిన ప్రయాణికులను చైతన్య పరుస్తూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. తూర్పుగానుగూడెంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, ఆర్డీఓ చైత్రవర్షిణి ఉన్నారు.